సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 7 । ఆగస్టు । 2024



కడలి కడుపుకోత

బీచ్ సరదా ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపుతుంది. పేరుపాలెం బీచ్‌లో ఏటా ఎందరో యువకులు మృత్యువాత పడుతున్నారు. 8లో ▸



ఆస్పత్రిలో బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతిచెందింది. దీంతో టి.నరసాపురం పీహెచ్‌సీ వద్ద బాలింత మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగారు. 8లో ▸



వంట గ్యాస్ లీకై..

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం జరగడంతో ముగ్గురు గాయపడ్డారు. తాడేపల్లిగూడెం సమీపంలోని టిడ్కో గృహ సముదాయంలో ఈ ఘటన జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

ఎన్నికల కమిషనర్‌తో భేటీ



తెలంగాణ ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఆర్వో ఉదయ భాస్కర్

భీమవరం(ప్రకాశం చౌక్): తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి ఓ ప్రైవేట్ కార్యక్రమం నిమిత్తం భీమవరం వచ్చారు. మంగళవారం ఆయనను జిల్లా రెవెన్యూ అధికారి, ఇన్‌చార్జ్ జేసీ జె.ఉదయభాస్కరరావు మంగళవారం స్థానిక ఫాల్కన్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

తాడేపల్లిగూడెంలో 49.2 మి.మీ. వర్షపాతం

భీమవరం: జిల్లా వ్యాప్తంగా మంగళవారం 230.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తాడేపల్లిగూడెంలో 49.2 మిల్లీమీటర్లు, పెనుగొండలో 32.4, పెంటపాడులో 30.2, ఇరగవరంలో 25, తణుకులో 19.8, అత్తిలిలో 4.2, గణపవరంలో 12.6, ఆకివీడులో 5.4, ఉండిలో 3.6, పాలకోడేరులో 5.4, పెనుమంట్రలో 4.2, ఆచంటలో 9.2, పోడూరులో 5.4, వీరవాసరంలో 10.8, భీమవరంలో 2.6, మొగల్తూరులో 1.4, నరసాపురంలో 2.4, పాలకొల్లులో 4.2, యలమంచిలిలో 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

స్కూల్ బస్సు ప్రమాదంపై చర్యలకు డిమాండ్



జిల్లా రవాణా శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలు

భీమవరం(ప్రకాశం చౌక్): నారాయణ స్కూల్ బస్సు యాక్సిడెంట్ సంఘటనపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భీమవరం శాఖ(ఏబీవీపీ) కార్యకర్తలు మంగళవారం రవాణా శాఖ అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏబీవీపీ భీమవరం విభాగం కన్వీనర్ కాయిత డిన్ను చందు మాట్లాడుతూ సోమవారం ప్రమాదంపై డీటీఓ ఉమామహేశ్వరరావుకు ఫిర్యాదు చేశామని.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ధర్నా చేయడం చేపట్టమన్నారు. సోమవారం సాయంత్రం నారాయణ స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, బస్సు ఫిట్‌నెస్ సక్రమంగా లేకపోవడంతో ముందు వెళ్తున్న వ్యాను ఢీకొట్టిందని.. నిబంధనలకు వ్యతిరేకంగా బస్సులు నడుపుతున్న విద్యాసంస్థలపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై రవాణా శాఖ అధికారి ఉమహేశ్వరరావును వివరణ కోరగా ప్రమాదంపై విచారణ చేస్తున్నామని చర్యలు తీసుకుంటామని చెప్పారు.

8న జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం(నేషనల్ కెరీర్ సర్వీసు), ఏపీ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ ఏలూరు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ కాంపౌండ్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాలో హెటిరో డ్రగ్స్, భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ లిమిటెడ్ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. హెటిరో డ్రగ్స్ కంపెనీలో జూనియర్ కెమిస్ట్‌లు, క్యూఏ, క్యూసీ ట్రైనీలు, మెయింటెనెన్స్(పురుషులు మాత్రమే) పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. జూనియర్ కెమిస్ట్ పోస్టులకు బీఎస్సీ కెమిస్ట్రీ, క్యూఏ, క్యూసీ ట్రైనీల పోస్టులకు ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ అండ్ అనలిటికల్ ఇంటిగ్రేటెడ్), మెయింటెనెన్స్ పోస్టులకు ఐటీఐ ఫిట్టర్స్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు.

17 నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఈనెల 17 నుంచి స్వామివారి దివ్య పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఈ ఉత్సవాలను ఈ నెల 20 వరకు అత్యంత వైభవంగా జరుపుతామన్నారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం నాలుగు రోజుల పాటు ఈ పవిత్రోత్సవాలు జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తుందన్నారు. ఆలయ అర్చకులు 17న అంకురార్పణతో ఈ ఉత్సవాలకు శ్రీకారం చుడతారని తెలిపారు. 18న పవిత్రాధివాసం, 19న పవిత్రావరోహణ, 20న ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి వేడుకలు కన్నులపండువగా జరుగుతాయన్నారు.



మర్యాదగా మానేయండి.. లేదంటే!

- జిల్లాలో మహిళా ఉద్యోగులపై పచ్చనేతల ప్రతాపం
- అంగన్‌వాడీ నుంచి డ్వాక్రా రిసోర్స్ పర్సన్స్ వరకూ వేధింపులే
- వేధింపులకు ఇద్దరు డ్వాక్రా ఆర్‌పీలు ఆత్మహత్యాయత్నం
- 67 మంది మహిళా చిరుద్యోగులపై వేధింపులు
- విధుల నుంచి అనేక మంది తొలగింపు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వారంతా సాధారణ మహిళలు... రాజకీయాలు, పార్టీలతో ఏ మాత్రం సంబంధం లేదు. కుటుంబానికి చేదోడువాదోడుగా నిలవాలని చిరు ఉద్యోగాలు చేస్తున్నారు. అలాంటి మహిళా ఉద్యోగులపై పచ్చమూకలు ప్రతాపం చూపుతున్నాయి. మనం వర్గం కాదు, పార్టీ కాదు, మన మనుషులే కాదంటూ ఉద్యోగాల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికులు, డ్వాక్రా రిసోర్స్ పర్సన్స్, డీఆర్‌డీఏలో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అడ్మినిస్ట్రేటర్లు ఇలా 67 మంది మహిళల ఉద్యోగాలు తొలగించారు. కేవలం రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే తొలగింపుల పర్వానికి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఇద్దరు డ్వాక్రా రిసోర్స్ పర్సన్స్‌లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రశాంతంగా ఉండే ఏలూరు జిల్లాలో కక్ష పూరిత రాజకీయాలకు కూటమి ప్రభుత్వం తెర దీసింది. మహిళా ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని విధుల నుంచి తొలగించడం కలకలం రేపింది. ప్రజాప్రతినిధికి నచ్చకపోయినా, మండలంలో, గ్రామంలో పచ్చ నేతలకు నచ్చకపోయినా విధుల్లో ఉండటానికి వీల్లేదు. ఏళ్ల తరబడి ఉద్యోగం చేస్తున్నా అధికారం మాది కాబట్టి మర్యాదగా మానేయాలి. లేదంటే కేసులు పెట్టి కుటుంబాల సంగతి తేలుస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో పల్లెల్లో భయానక వాతావరణం నెలకొంది. ప్రధానంగా దెందులూరు, చింతలపూడి, ఉంగుటూరు, గోపాలపురం, పోలవరం నియోజకవర్గాల్లో ఈ నీచ రాజకీయాల పరంపర కొనసాగుతుంది.

అధికారం మాదే.. ఉద్యోగాలు మావే

అధికారం అండతో మండల స్థాయి అధికారులు మొదలుకొని కింది స్థాయి సిబ్బంది వరకు అందర్నీ బదిలీ పేరుతో కావాల్సిన ఉద్యోగులను తెచ్చుకున్నారు. అంతవరకు బాగానే ఉన్నా... కూటమి నేతలు అక్కడితో ఆగకుండా డ్వాక్రా రిసోర్స్ పర్సన్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, గ్రామాల్లో ఉండే విలేజ్ ఆర్గనైజేషన్ అడ్మినిస్ట్రేటర్లు, ఆశా వర్కర్లు ఇలా అందరిని టార్గెట్ చేసి వేధిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, పచ్చ పార్టీల చోటా నేతలు చెప్పిన మాట వినకపోతే వెంటనే కారణం లేకుండా తొలగించాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇంతవరకు ఏలూరు జిల్లాలో 67 మందిని తొలగించారు. పెదవేగిలో 20 ఏళ్ల నుంచి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు, దెందులూరులో కొన్నేళ్ళ నుంచి పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాల్ని నిర్దాక్షిణ్యంగా తొలగించారు. చింతలపూడిలో 25 ఏళ్ల నుంచి పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికురాలు, కుక్కునూరులో కూడా ఏళ్ళ తరబడి పనిచేస్తున్న వారిని తొలగించారు. పెదవేగి మండలంలో అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్‌ను తొలగించారు.

డ్వాక్రాలో అరాచకం

డీఆర్‌డీఏ, మెప్మాలో అరాచక పర్వం కొనసాగుతుంది. ఏలూరు నగరంలో 17 మంది, జిల్లాలో 44 మంది వీవోఏలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. పదుల సంఖ్యలో వీవోఏల్ని ఉద్యోగాలు మానేయాలని ఒత్తిడి చేస్తున్నారు. అధికార పార్టీ వేధింపులు తాళలేక ఏలూరులో డ్వాక్రా రిసోర్స్ పర్సన్ పిల్లి విజయలక్ష్మి, ఉంగుటూరు మండలంలో పి.కనకదుర్గలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చికిత్స పొందుతున్నా వేధింపులు మాత్రం ఆగలేదు. ఏలూరు నగరంలో 17 మంది రిసోర్స్ పర్సన్లను టార్గెట్ చేసి అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో తొలగించారు. చింతలపూడి నియోజకవర్గంలో లింగపాలెంలో అత్యధికంగా 11 మందిని తొలగించారు. చింతలపూడి నియోజకవర్గంలో 15 మంది, దెందులూరులో 16 మంది, ద్వారకాతిరుమల మండలంలో 9 మంది, టీ.నర్సాపురంలో ఇద్దరు, వేలేరుపాడులో ఒకరు, ఉంగుటూరులో ఒకరిని తొలగించారు.

అడ్డగోలు తొలగింపులు ఆపాలి



కేంద్ర ప్రాయోజిత పథకాల్లో పనిచేస్తున్న పలువురు స్కీం వర్కర్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే విచ్చలవిడిగా తొలగించడం అన్యాయం. తక్షణం తొలగించిన చిరు ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి. ఒక వేళ ఏదైనా కారణంతో తొలగించాల్సి వస్తే శాఖాపరమైన విచారణ జరిపిన తర్వాతనే చర్యలు చేపట్టాలి.
– ఆర్.లింగరాజు, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు

సానుభూతిపరుడని తొలగించారు



అంబరుపేట పంచాయతీలో పంపుహౌస్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాను. 2000లో ఉద్యోగంలో చేరాను. గత 23 సంవత్సరాలుగా పనిచేస్తున్న నన్ను కేవలం గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడిగా పనిచేశాననే కారణంతోనే ఉద్యోగం నుంచి తొలగించారు.
– కె.పుల్లయ్య, పీడబ్ల్యూసి ఉద్యోగి, భీమడోలు మండలం

రాజకీయ ముద్ర వేసి..



ఎంతో కాలంగా వీవోఏగా పని చేస్తున్నాను. కేవలం రూ.8 వేల వేతనంతో పనిచేస్తున్నాను. మా పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి నువ్వు నీ పోస్టు నుంచి తప్పుకో.. మాకు నచ్చిన వారిని ఆ పోస్టులో పెట్టుకుంటామని అధికార పార్టీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉంది. నాలాంటి చిరు ఉద్యోగినిని రాజకీయ ముద్ర వేసి తొలగించాలని చూస్తున్నారు.
– మల్లెల్లి ద్వారకా, డ్వాక్రా వీవోఏ, లింగగూడెం, చింతలపూడి మండలం

వేధింపులు తట్టుకోలేక..



టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నన్ను వీవోఏగా తప్పుకోవాలని టీడీపీ నేత వేధింపులకు గురిచేస్తున్నారు. ఆత్మహత్యాయత్నం చేశాను. రూ.1.80 లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చింది. వారి ఇంట్లోని పనిమనిషిని పెట్టుకుంటానంటూ తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు.
వి.శారద, వీవోఏ, బొమ్మిడి, ఉంగుటూరు మండలం

తిరుమలాపురంలో వీవోఏల తొలగింపు



తిరుమలాపురానికి చెందిన వీవోఏలు ప్రీతి, జాహ్నవి

జంగారెడ్డిగూడెం రూరల్: గత 5 ఏళ్లగా జంగారెడ్డిగూడెం మండలం తిరుమలాపురంలో గ్రామ సంఘాలకు వీవోఏ (విలేజ్ ఆర్గోనైజేషన్ అసిస్టెంట్)లుగా పని చేస్తూ వచ్చిన తమను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో తొలగించారంటూ మనెల్లి ప్రీతి, మానుకొండ జాహ్నవిలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీతి ఆదర్శ తిరుమలాపురం, జాహ్నవి తిరుమలాపురం గ్రామ సంఘానికి వీవోఏలుగా పనిచేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మా ప్రభుత్వంలో మా వాళ్లని వీవోఏలుగా నియమించుకుంటామని అధికార పార్టీ నాయకుడు సుబ్రమణ్యం ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు చేశారని ప్రీతి పేర్కొన్నారు. తమకు అన్యాయం జరగకుండా చూడాలని లిఖిత పూర్వకంగా వినతి పత్రాలు అందజేశామన్నారు. గత నెల 31న ఏపీఎం, సీసీలను గ్రామానికి రప్పించి సమావేశం ఏర్పాటు చేసి తాము లేకుండా 10 మంది గ్రామ సంఘం సభ్యులచే టీడీపీ శ్రేణులు తెల్ల పేపర్ మీద సంతకాలు పెట్టించి తమను తొలగిస్తున్నట్లు ప్రకటన చేసేశారన్నారు. ఆ రోజు తమకు సంబంధించిన సభ్యులు ఎవరూ కూడా సమావేశానికి హాజరు కాలేదని, సంతకాలు చేయలేదని ప్రీతి చెప్పుకొచ్చారు. తమ వద్ద ఉన్న పుస్తకాలను కొత్త సీఏలకు అప్పగించాలని, వీవోఏలుగా ఇక నుంచి తాము కొనసాగడం లేదని సీసీ కృష్ణమూర్తి తెలిపినట్లు ప్రీతి తెలిపారు. తమను తొలగించడం వల్ల కుటుంబ పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వరద సాయం.. తూతూమంత్రం

- వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 44 గ్రామాల్లో నష్టం
- కళ్ల ముందే కనిపిస్తున్నా.. రేషన్ కార్డు ఉంటే సాయమంటూ నిబంధన
- రూ.3 వేల తక్షణ సాయం కొన్ని కుటుంబాలకే
- నేటికీ అరకొరగానే బియ్యం పంపిణీ
- ఇళ్లు ధ్వంసమైనా, దెబ్బతిన్నా రూ.3 వేలతోనే సరిపెట్టుకోవాలి



పెద్దవాగు వల్ల దెబ్బతిన్న కమ్మరిగూడెం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: అసలే ముంపు మండలాలు.. ఆపై గోదావరి ఉగ్రరూపం చూపితే.. వారి బతుకులు ఛిన్నాభిన్నమే. పునరావాస కేంద్రాలు, కొండ గట్లకు చేరుకుని రోజుల తరబడి ఉండిపోతారు. గోదావరి శాంతించాక బురదలోనే ఇళ్ళకు వెళ్ళి బాగుచేసుకుంటారు. తిప్పలుపడి చిన్నపాటి గుడిసెలు ఏర్పాటు చేసుకుంటారు. ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఏటా వరద విలయం కొనసాగుతుండడతో.. గత ప్రభుత్వం పూర్తి స్థాయిలో వరద బాధితులను ఆదుకుంది. ప్రస్తుత ప్రభుత్వం వారిని ఆదుకుంటామన్న ప్రచారం తప్ప పూర్తి స్థాయిలో అందరికీ సాయం అందని పరిస్థితి. రేషన్ కార్డు అర్హతే ప్రామాణికం అంటూ వందల మందికి పరిహారాన్ని ఎగ్గొట్టారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కుతోచని స్థితిలో బాధితులు ఉన్నారు.

50 శాతం మందికి అందని సాయం

పెద్దవాగు ఉధృతి, గోదావరి వరదకు ఏలూరు జిల్లా వేలేరుపాడులోని 43 గ్రామాలు, కుక్కునూరులో ఒక గ్రామం దెబ్బతింది. అధికారులంతా అక్కడే ఉండాలని ప్రభుత్వం రెండు రోజులు హడావుడి చేసి ఆ తరువాత దాని సంగతి పూర్తిగా మరిచిపోయింది. వేలేరుపాడులోనే పెద్దవాగు దాటికి 12 గ్రామాలు, గోదావరి వరద ఉధృతికి 31 గ్రామాల్లో 18 వేల మందికి పైగా నష్టపోయారు. సుమారు 7200కు పైగా కుటుంబాలు నష్టపోయాయి. అత్యధిక శాతం మంది పునరావాస కేంద్రానికి వెళ్ళగా ఎక్కువ మంది కొండ గుట్లపైనే మకాం ఉన్నారు. వారికి భోజనం, వసతి మొదలుకొని కొవ్వొత్తుల వరకు సరిగా ఏదీ పంపిణీ జరగలేదు. ప్రతి కుటుంబానికీ రూ.3 వేలు సాయం అందిస్తామని ప్రకటించి, రేషన్ కార్డు ఉన్నవారికే సాయం అంటూ అనేక మందికి పరిహారం ఎగ్గొట్టారు. 25 కేజీల బియ్యం, కందిపప్పు, లీటరు నూనె, ఉల్లిపాయలు, బంగాళాదుంపలతో పాటు కూరగాయలు పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించి రెండు రోజులు హడావుడి చేశారు. 50 శాతం మందికి అందని పరిస్థితి.



వరదకు నష్టపోయిన అల్లూరు నగర్

జగన్ పాలనలో అందరికీ సాయం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గోదావరి వరద ముంపు మండలాల్లో పర్యటించారు. తక్షణ సాయం, నిత్యావసరాలు, నూరు శాతం అందించాలని ఆదేశించి క్షేత్రస్థాయిలో బాధితులకు భరోసా ఇచ్చారు. నష్టపోయిన కుటుంబాలే కాకుండా మండలాన్ని, గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ప్రతి ఇంటికీ పరిహారంతో పాటు నిత్యావసరాలు అందజేశారు. పునరావాస కేంద్రాల్లో రెండు పూటలా భోజనం, టిఫిన్లు, టీ ఏర్పాటుతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా పెద్ద ఎత్తున సహాయ సహకారాలు అందించాయి. ఈ సారి పునరావాస కేంద్రాలు సక్రమంగా నిర్వహించకపోవడం, అరకొర సౌకర్యాలు, ఇతర కారణాలతో ఏమీ పట్టించుకోలేదు.

రేషన్ కార్డు ఉంటేనే..

కళ్ళ ముందే నష్టం కనిపిస్తున్నా రేషన్ కార్డు కావాలని అడ్డగోలు నిబంధన పెట్టి కార్డు లేనివారికి రూ.3 వేల సాయం అందించలేదు. వాస్తవానికి వేలేరుపాడు మండలంలో 7200 కుటుంబాలకు పైగా నష్టపోయారు. అధికారుల అంచనా మాత్రం తక్కువగా ఉంది. అధికారిక లెక్కల ప్రకారం పెద్దవాగు వల్ల 12 గ్రామాల్లో 1647 కుటుంబాలు, గోదావరి వరద వల్ల 3278 కుటుంబాల నిరాశ్రయులయ్యారు. మొత్తం 4925 మంది వరద వల్ల నిరాశ్రయులైనట్టు అధికారులు చెబుతున్నారు. పరిహారం మాత్రం 4025 కుటుంబాలకే ఇచ్చారు. మిగిలిన వారికి రేషన్‌కార్డులు లేకపోవడంతో పరిహారం తీసుకునే అర్హత లేదని తేల్చేశారు. గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా ఇల్లు దెబ్బతింటే రూ.95 వేలు, గుడిసె దెబ్బతింటే రూ.10 వేలు పరిహారం అందించారు. ఇప్పుడు ఇంటి నష్టాలకు ఒక్క రూపాయి కూడా ఇచ్చేది లేదని పరోక్షంగా తేల్చారు.

నాకు ఏ సాయం అందలేదు



నాకు ఏ వరద సాయం అందలేదు. రేషన్ కార్డు లేదని బియ్యం కూడా ఇవ్వలేదు. పెళ్ళి మూడేళ్ళు అవుతోంది. ఆధార్‌కార్డు మాత్రం ఉంది. ఆ ప్రూఫ్ సరిపోదని అధికారులు చెబుతున్నారు.
– సోడే మహేష్, తూర్పుమెట్ట

బియ్యం ఇవ్వలేదు



గోదావరి వరద వల్ల. ఉపాధి పనులు లేక 12 రోజులుగా ఇంట్లోనే ఉంటున్నాం. కనీసం బియ్యం ఇవ్వమని అధికారులను బతిమిలాడాం. అయినా ఇవ్వలేదు. రేషన్ కార్డు లేకుండా ఏమీ చేయలేమన్నారు.
– కొర్రి శ్రీను, తూర్పుమెట్ట

జగన్ హయాంలో అన్నీ ఇచ్చారు



వైఎస్సార్‌సీపీ హయాంలో ఆధార్ కార్డు ఉంటే అన్ని సాయాలు చేశారు. బియ్యం, కందిపప్పు, మంచినూనె, రూ.2 వేల ఆర్థిక సాయం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కావాలంటూ అధికారులు పరిహారం నిరాకరించారు.
– చిచ్చడి చిన్నారి, తూర్పుమెట్ట

ఉద్యాన పంటల నిధులు సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు కలెక్టర్ నాగరాణి సూచన

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఉద్యానవన పంటల సాగుకు కేటాయించిన నిధులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జాతీయ ఆహార నూనె గింజల పథకంలో రూ.252.20 లక్షలు మంజూరు చేశామని, ఈ పథకం ద్వారా 300 హెక్టార్లలో పామాయిల్ పంట సాగు లక్ష్యంగా నిధులు కేటాయించామన్నారు. సంవత్సరానికి ఎరువులు, అంతర పంట వేసినందుకు రూ.10,500 రాయితీ ఇస్తారన్నారు. 40 హెక్టార్లు లక్ష్యంగా రూ.15.25 లక్షలు కూరగాయల పంటల అభివృద్ధికి అందజేస్తారన్నారు. రూ.154.78 లక్షలు పండ్లు, పూల తోటలు, కూరగాయల అభివృద్ధి లక్ష్యంగా కేటాయించారన్నారు. పండ్ల విస్తరణ పథకం ద్వారా మామిడికి రూ.8 వేలు, జామ రూ.18 వేలు, కోకో రూ.12 వేలు, పూల సాగుకు రూ.16 వేల రూపాయలు రాయితీ ఇస్తారని చెప్పారు. మామిడి పునరుద్ధరణకు రూ.18 వేలు, ప్లాస్టిక్ మల్చింగ్‌కు రూ.16 వేలు, ప్యాక్ హౌస్ 96 మీటర్లు రూ.2 వేలు, కోల్డ్ స్టోరేజ్ రూంలకు రూ.5.25 లక్షలు, తేనెటీగల పెంపకానికి రూ.10 వేలు అందిస్తారని చెప్పారు.

పర్యాటకంపై ప్రజాభిప్రాయ సేకరణ

మన దేశంలో ప్రపంచ పర్యాటకాన్ని పెంపొందించేలా ప్రజల అభిప్రాయాలను తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్‌లో ఓటు వేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ×దేఖో అప్నా దేశ్ – పీపుల్స్ చాయిస్ 2024 కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ఆధ్యాత్మికం, సంస్కృతి–వారసత్వం, ప్రకృతి – వన్యప్రాణులు, సాహస కార్యాలు తదితర కేటగిరీలలో అత్యుత్తమ పర్యాటక ఆకర్షణలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించడం, తద్వారా ప్రపంచ స్థాయి పర్యాటకం అభివృద్ధి చేయడం దీని లక్ష్యమన్నారు. దీనిలో భాగంగా మై గవర్నమెంట్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక వెబ్‌పేజీ అభివృద్ధి చేశారని, ప్రజలు వివిధ కేటగిరీలలో తమకు ఇష్టమైన పర్యాటక ప్రదేశాలను సూచిస్తూ ఓటు వేయాలన్నారు.

ఉమ్మడి పశ్చిమలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు సంస్థ జీఎం ఎల్.శ్రీను తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మెరుగైన టెలికం సేవల కోసం వినియోగదారులు తమ సిమ్‌లు 4జీ టెక్నాలజీకి అప్‌గ్రేడ్ చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం 2జీ/3జీ సిమ్‌లు వినియోగిస్తున్న వారు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 60 వేల మంది వరకు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరికి ఉచిత సిమ్‌లు అందజేస్తున్నామని కస్టమర్ సర్వీస్ సెంటర్, ఫ్రాంచైజీలు/రిటైలర్లు/ఏజెంట్ల వద్ద సిమ్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

35 మంది సీఐల బదిలీ

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో భారీగా సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురికి పోస్టింగ్ ఇవ్వగా మరికొందరిని వీఆర్‌లో ఉంచారు. ఏలూరు రేంజ్‌లో 35 మంది సీఐలు బదిలీ కాగా, వారిలో 13 మందిని ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి త్రోబాల్‌లో ఏపీకి మూడో స్థానం


రాణించిన త్రోబాల్‌ క్రీడాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి త్రోబాల్‌ పోటీల్లో ఏపీ మూడో స్థానం సాధించింది. ఏపీ జట్టు విజయానికి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సీనియర్‌ క్రీడాకారులు నలుగురు పి.నరేంద్ర, ఎం.ఈశ్వర్‌, టి.రత్నకుమార్‌, ఎ.నాగమునీంద్ర కృషి చేశారు. ఈ సందర్భంగా జిల్లా త్రోబాల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు సీహెచ్‌ఏఆర్‌కే వర్మ, సెక్రటరీ ఎస్‌ఎం.శ్రీనాథ్‌, కోశాధికారి టీఎస్‌ఎస్‌ కుమార్‌, సభ్యులు విజేతలకు అభినందనలు తెలిపారు.

సికిలే స్కూల్‌ వద్ద ఉద్రిక్తత

నరసాపురం: పట్టణంలోని జె.సికిలే స్కూల్‌ వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. తెలంగాణ వరంగల్‌ నర్సీపట్నంకు చెందిన ఇసురం స్వాతి, ఆమె కుమారుడు తేజ ఇద్దరూ కలసి పాఠశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆందోళన సాగింది. చివరకు పోలీసుల రంగప్రవేశంతో ఆందోళనకు తెరపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. తేజ శ్రేష్ఠ పరీక్షలో ఆల్‌ఇండియా స్థాయిలో 997 ర్యాంకు రాగా, వెబ్‌ ఆప్షన్‌లో సికిలే స్కూల్‌ ఎంచుకున్నాడు. తల్లీ, కొడుకు సోమవారం స్కూల్‌కి రాగా, సీటు ఇవ్వడం కుదరదని, భారీగా సొమ్ములు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం చెప్పడంతో వారు సోమవారం రాత్రి ఒక ఇంటిలో ఉండి, మంగళవారం ఉదయం మళ్లీ స్కూల్‌కి వచ్చి సొమ్ములు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించారు. బాధితులకు జనసేన నాయకులు కూడా కలసి ఆందోళన చేశారు. చివరకు టౌన్‌ సీఐ బి.యాదగిరి వచ్చి యాజమాన్యం, బాధితులతో మాట్లాడారు. సీబీఎస్‌ఈ వారికి లెటర్‌పెట్టి వారి ఆదేశాలతో సీటు ఇస్తామని యాజమాన్యం చెప్పడంతో ఆందోళన విరమించారు.

పూలపల్లిలో 17.50 కాసుల బంగారం, వెండి చోరీ

పాలకొల్లు సెంట్రల్‌: పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలోని ఓ ఇంటిలో దొంగలు పడి బంగారం, వెండి, నగదు దోచుకుల్లిన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూలపల్లి గ్రామంలో గంటాలమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్న బక్క కృష్ణవేణి సోమవారం రాత్రి 7 గంటల సమయంలో దగ్గర్లోనే ట్యూషన్‌ ఉండడంతో ఇంటి తలుపునకు గెడవేసి తన పిల్లలను ట్యూషన్‌కు వద్ద దింపి వచ్చింది. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి వంట గదిలో వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బెడ్‌రూమ్‌లో బీరువా తలుపులు తెరిచి ఉండడం గమనించింది. బీరువాను పరిశీలించగా అందులో ఉన్న 17.5 కాసుల బంగారం, 750 గ్రాముల వెండి, రూ.5 వేలు నగదు దోపిడికి గురైనట్లు గుర్తించింది. ఈ ఘటనపై మంగళవారం బాధితురాలు కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌ సిబ్బంది తెలిపారు.

కడుపుకోత మిగుల్చుతున్న కడలి

- బీచ్‌లో స్నానాలకు దిగి మృత్యువాత పడుతున్న యువకులు
- విషాదంగా మారుతున్న విహారయాత్రలు
- ప్రమాదాలకు నిలయంగా పేరుపాలెం బీచ్‌


బీచ్‌లో సందడి చేస్తున్న సందర్శకులు (ఫైల్‌)

మొగల్తూరు: సాగర తీరాన.. ఎగసిపడుతున్న అలల నడుమ.. సముద్రస్నానం చేయడం అందరికీ ఇష్టమే. కానీ ఈ బీచ్‌ సరదా ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం నింపుతుంది. సముద్ర స్నానానికి అనువుగా లేకపోయినా ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న అలలను చూసి ఉత్సాహంతో వాటికి ఎదురెళ్లి యువకులు మృత్యువాత పడుతున్నారు. సముద్ర స్నానం చేస్తూ గల్లంతవుతున్న వారు కొందరైతే, ప్రమాదాల బారిన పడి కాలు, చెయ్యి విరగ్గొట్టుకుంటున్న వారు మరికొందరు. తల్లితండ్రులకు ఆసరాగా నిలవాల్సిన యువకులు మద్యం సేవించి స్నానానికి దిగి కడలిలో కలిసిపోతున్నారు. దీంతో విహారయాత్రలు కాస్త విషాదంగా మారుతున్నాయి.

19 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోనే ఏకైక బీచ్‌లుగా పేరుపాలెం, కేపీపాలెం బీచ్‌లు పేరుపొందాయి. నరసాపురం నియోజకవర్గంలో సుమారు 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. మొగల్తూరు మండలంలోని పేరుపాలెం, కేపీపాలెం తీరప్రాంతంలో కొబ్బరి, సరుగుడు తోటలతో పాటు వేళాంకణి మాత, వేంకటేశ్వరస్వామి ఆలయాలు వెలిశాయి. దీంతో సందర్శకుల రాక మొదలు కావడంతో క్రమేణా బీచ్‌లుగా మారాయి. కార్తీక మాసంలో నెలరోజులపాటు వేలాది మంది పర్యాటకులు సముద్ర స్నానం చేసి ఆలయాలను దర్శించుకుని తీరంలోని కొబ్బరి, సరుగుడు చెట్ల మధ్య వనభోజనాలు చేస్తుంటారు. అయితే ప్రతి ఏటా వేలాది మంది భక్తులు వస్తున్నా ఇక్కడ సౌకర్యాలు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటాయి.

సముద్ర స్నానానికి అనువైన ప్రాంతం కాదు

పేరుపాలెం బీచ్‌ సముద్ర స్నానానికి అనువుగా లేదు. ఇక్కడ సముద్రంలోకి దిగిన వారికి కాలు అడుగుబాగంలో(అండర్‌ కరెంట్‌) పాదం కింద భాగంలో గొయ్యి కింద ఏర్పడుతుంది. దీంతో మద్యం సేవించి స్నానాలకు దిగడం లేదా అవగాహన లేకపోవడంతో అలలు వచ్చిన సమయంలో బ్యాలెన్స్‌ చేసుకోలేక పడిపోయి గల్లంతవుతున్నారు. ఆప్రాంతంలో కార్తీకమాసం మినహా మామూలు రోజుల్లో బందోబస్తు ఉండదు. కార్తీకమాసంలో అయితే రెవెన్యూ, పోలీస్‌ అధికారులు గజ ఈతగాళ్లను, పోలీస్‌ సిబ్బందిని నియమించి సముద్రంలోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటారు. మామూలు రోజుల్లో ఎవరి అడ్డూఅదుపు లేకపోవడంతో స్నానాలకు దిగి ప్రాణాలు తీసుకుంటున్నారు. గత ఏడాది జూన్‌లో హైదరాబాద్‌ నుంచి పాలకొల్లు శుభకార్యానికి వచ్చిన ఇద్దరు యువకులు సముద్ర స్నానానికి దిగి మృత్యువాత పడ్డారు. నిన్నటి రోజున స్నేహితుల దినోత్సవం సందర్భంగా తణుకు నుంచి ఆరుగురు స్నేహితులు బీచ్‌కు వచ్చి సముద్ర స్నానానికి దిగడంతో ఒక యువకుడు గల్లంతయ్యాడు. తెలిసీ తెలియని వయసులో సముద్ర స్నానాలకు దిగి గల్లంతై ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతున్నారు.

ఏడేళ్లలో 40 మంది మృత్యువాత

గత ఏడు సంవత్సరాలుగా చూస్తే సుమారు 40 మంది బీచ్‌లో స్నానానికి దిగి మృత్యువాత పడ్డారు. 2015లో ఆరుగురు, 2016లో ఇద్దరు, 2017లో ముగ్గురు, 2018లో ఎనిమది మంది, 2019లో అయిదుగురు, 2021లో నలుగురు, 2022లో నలుగురు, 2023లో ముగ్గురు, 2024లో ఇప్పటివరకు నలుగురు, ఈనెలలోనే ఇద్దరు గల్లంతై మృతి చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీచ్‌ల వద్ద నిరంతరం భద్రతా చర్యలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేశాం



పేరుపాలెం బీచ్‌లో గత ఏడాది పోలీస్‌ కంట్రోల్‌ రూమ్‌ను ఏర్పాటు చేశాం. సముద్ర స్నానానికి వెళ్లేవారికి అవగాహన కల్పించి తగు రక్షణ చర్యలు తీసుకుంటాం.

కె.వెంకటరమణ, ఎస్సై, మొగల్తూరు

గణపవరం మండలాన్ని పశ్చిమలో కలపాలి


విద్యాశాఖ డైరక్టర్‌ పార్వతికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్‌ రాష్ట్ర నాయకులు

గణపవరం: గణపవరం మండలం భౌతికంగా పశ్చిమగోదావరి జిల్లాలో కలిసినా సాంకేతికంగా విద్యాపరమైన విషయాల్లో ఇంకా ఏలూరు జిల్లాలోనే కొనసాగుతుందని, వెంటనే గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలో కలపాలని యూటీఎఫ్‌ రాష్ట్ర నాయకులు విద్యాశాఖ అడిషనల్‌ డైరక్టర్‌ పార్వతికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయాన్ని గణపవరం మండల యూటీఎఫ్‌ నాయకులు విలేకరులకు తెలిపారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలం ఏలూరు జిల్లాలో ఉంది. అయితే భీమవరానికి సమీపంలో ఉండటంతో మండల ప్రజల అభీష్టం మేరకు పశ్చిమ గోదావరి జిల్లాలో కలపాలని 2022 మే నెలలో గణపవరం వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ను అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సభాముఖంగా కోరారు. దీనిపై స్పందించిన అప్పటి సీఎం వైఎస్‌ జగన్‌ గణపవరం మండలాన్ని పశ్చిమలో కలుపుతున్నట్లు ప్రకటించారు. దీనితో గణపవరం మండలం ఏలూరు నుంచి పశ్చిమగోదావరి జిల్లాలో విలీనమైంది. అయితే విద్యాపరంగా మాత్రం గణపవరం మండలం ఇంకా ఏలూరు జిల్లాలో కొనసాగుతోంది.

వంట గ్యాస్‌ లీకై ముగ్గురికి తీవ్రగాయాలు

తాడేపల్లిగూడెం
టిడ్కో గృహ సముదాయంలో ఘటన



కాలిన గాయాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బోడపాటి మురళి, నీలిమ

తాడేపల్లిగూడెం అర్బన్‌ : వంట గ్యాస్‌ సిలిండర్‌ నుంచి గ్యాస్‌ లీకై సంభవించిన అగ్నిప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు తీవ్రంగా గాయాలపాలుకాగా వారి కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణం సమీపంలోని ఎల్‌.అగ్రహారం వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయంలో ఈ ఘటన మంగళవారం జరిగింది. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన బోడపాటి మురళి తాపీపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతనికి భార్య కుమారి, కుమార్తె నీలిమ ఉన్నారు. ఏపీ టిడ్కో గృహ సముదాయంలోని సీ–71 బ్లాకులో 102 నంబరు ప్లాట్‌లో వీరు నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి భార్యాభర్తలు మురళి, కుమారి ఒక బెడ్‌రూములోను, కుమార్తె నీలిమ మరో బెడ్‌రూములో నిద్రపోయారు. మంగళవారం తెల్లవారుజామున కుమారి నిద్రలేచి బెడ్‌రూము నుంచి హాలులోకి వచ్చి లైటు వేసేందుకు స్విచ్‌ వేయగా, ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆమె శరీరాన్ని అంటుకున్నాయి. హాలుతో పాటు బెడ్‌రూములోనూ మంటలు అలుముకోవడంతో బెడ్‌రూములో పడుకున్న మురళిని మంటలు చుట్టుముట్టాయి. దీంతో అతను మంచంపై నుంచి దిగి ఒక్కసారిగా బయటకు పరుగున వెళ్లి నేలపై పొర్లడంతో మంటలు ఆరిపోయాయి. ఈ ఘటనలో మురళి శరీరం కాలిపోవడంతో చర్మం ఊడిపోయింది. ఈలోగా హాలులో మంటలు తగ్గడంతో స్థానికులు ఫ్లాట్‌లోకి వచ్చి చూడగా మురళి భార్య కుమారి ఒళ్లంతా కాలిపోయి కిందపడి ఉంది. అదే సమయంలో మరో బెడ్‌రూములో నిద్రపోతున్న నీలిమ బయటి నుంచి అరుపులు వినబడడంతో బయటికి వచ్చింది. అగ్నిప్రమాదం సంభవించడంతో గదులన్నీ తట్టుకోలేనంత వేడెక్కి ఉండటంతో నీలిమ కాళ్లు, చేతులు అక్కడి వేడికి కాలిపోయి బొబ్బలు వచ్చాయి. స్థానికులు వెంటనే 108కి సమాచారం అందించి, వారిని తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ మాట్లాడుతూ భార్యాభర్తలిద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పారు. వారిని 24 గంటలపాటు పరిశీలనలో ఉంచామన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రూరల్‌ సీఐ ఎ.రమేష్‌ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో గ్యాస్‌ సిలిండర్‌ పేలిపోయి ఉంటే పైనున్న ఫ్లాట్ల వారికి కూడా పెను ప్రమాదం సంభవించేదని చెబుతున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి


టి.నరసాపురం పీహెచ్‌సీ వద్ద బాలింత మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబసభ్యులు

ఆసుపత్రి వద్ద కుటుంబీకుల ఆందోళన

టి.నరసాపురం: వైద్యుల నిర్లక్ష్యం ఒక బాలింత మృతికి కారణమైంది. దీంతో ఆమె కుటుంబసభ్యులు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై టి.నరసాపురం పీహెచ్‌సీ వద్ద బాలింత మృతదేహంతో ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన వగ్గాల అలివేలు మంగ(23) 11 రోజుల బాలింత. జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రిలో గత నెల 27న సిజేరియన్‌ ఆపరేషన్‌ ద్వారా డెలివరీ జరిగింది. మగబిడ్డ పుట్టాడు. ఈ నెల 5న ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి మండలంలోని ప్రకాష్‌నగర్‌ ఇంటికి వచ్చింది. అదే రోజు అర్ధరాత్రి అనారోగ్యంగా ఉందని భర్త రాముకు చెప్పడంతో తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఆమెను ఆటోలో టి.నరసాపురం ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆ సమయంలో ఆసుపత్రి గేట్లు వేసి ఉన్నాయి. 15 నిమిషాలపాటు గేట్లు ఎవరూ తీయకపోవడంతో బాధితులే గేట్లు తీసుకుని లోనికివెళ్లారు. డ్యూటీలో ఉన్న నర్సు ఆటో వద్దకు వచ్చి బీపీ, షుగర్‌ పరీక్షలు చేశారు. షుగర్‌ తక్కువగా ఉందని తెలిపి లోపలికి వెళ్లిపోయారు. ఈలోగా 108 వాహనం రావడంతో, అలివేలు మంగను చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో అలివేలు మంగ మృతదేహాన్ని తిరిగి టి.నరసాపురం పీహెచ్‌సీ వద్దకు తీసుకువచ్చి ఆందోళన నిర్వహించారు. సకాలంలో వైద్యం అందకపోవడం వల్లే ఆమె చనిపోయిందని, వైద్యారోగ్య సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పండంటి బిడ్డకు జన్మనిచ్చి పట్టుమని పదిరోజులైనా కాకముందే తన భార్య ఇలా తనను వదిలివెళ్లిందని భర్త రాము కన్నీరమున్నీరయ్యాడు. భర్త రాము ఫిర్యాదుతో టి.నరసాపురం ఎస్సై డి.దుర్గామహేశ్వరరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై వివరాలు తెలుసుకున్న ఉన్నతాధికారులు వెంటనే విచారణకు ఆదేశించారు. ఇన్‌చార్జి డీఎంఅండ్‌హెచ్‌వో నాగేశ్వరరావు మంగళవారం టి.నరసాపురం పీహెచ్‌సీకి వచ్చి విచారణ ప్రారంభించారు. బాలింత మృతి విషయంలో వైద్యారోగ్య సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.


అలివేలు మంగ (ఫైల్‌)

చిట్టీల వ్యాపారి ఘరానా మోసం

మొగల్తూరు: చిట్టీల పేరుతో ఒక వ్యక్తి మోసం చేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సుమారు రూ.4 కోట్లు చిట్టీల పేరుతో కట్టించుకుని ఉడాయించడంతో గ్రామస్తులు, బాధితులు గగ్గోలు పెడుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు మండలం కేపీపాలెం సౌత్‌ గ్రామానికి చెందిన సుంకర శ్రీనివాసరావు అనే వ్యక్తి గత కొంతకాలంగా చిట్టీలు కట్టించుకుంటూ నమ్మకంగా ఉన్నాడు. మొగల్తూరు, కేపీపాలెం, వేములదీవి, రామన్నపాలెం వంటి పరిసర గ్రామాల్లో సుమారు రూ.4 కోట్ల మేర వసూలు చేసి ఉడాయించాడు. ఇప్పటివరకూ చిట్టీలు పాడుకున్నా సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఘొల్లుమంటున్నారు. బాధితులంతా మంగళవారం కేపీపాలెం సౌత్‌ గ్రామంలో తమకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. మూడురోజుల క్రితం చిట్టీల నిర్వాహకుడు గ్రామం వదిలి వెళ్లినట్టుగా తెలియడంతో పోలీసులను ఆశ్రయించే ప్రయత్నంలో ఉన్నారు. అయితే వ్యాపారి ఏలూరు పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టుగా గుర్తించారు. దీనిపై మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణను వివరణ కోరగా చిట్టీ వ్యాపారి నుంచి మోసపోయామంటూ గ్రామంలో బాధితులు ధర్నా చేస్తున్నట్టు తెలిసిందని, అయితే తమకు ఇంకా ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

రైతుల నుంచి వివరాల సేకరణ

ద్వారకాతిరుమల: నకిలీ విత్తనాలు నట్టేట ముంచాయి శీర్షికతో మంగళవారం ప్రచురితమైన కథనంపై రైతు సంఘ నేతలు, అధికారులు స్పందించారు. సాయన్నపాలెంలో రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఏవో దుర్గారమేష్‌ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన ఒకరకం విత్తనాలు మాత్రమే దిగుబడి తగ్గిందని, అవి నకిలీ విత్తనాలు కాదని తెలిపారు. ఒక రైతుకు పూర్తిగా సొమ్ము చెల్లించలేదని, ఆ విషయంపై కంపెనీ సీడ్‌ ఆర్గనైజర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటామని రైతులు తెలిపినట్టు ఏఓ దుర్గారమేష్‌ డిప్యూటీ తహసీల్దార్‌ బి.దుర్గా మహాలక్ష్మి, పేర్కొన్నారు. మొక్కజొన్న సీడ్‌ కంపెనీల మోసాలను అరికట్టి, బాధిత రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు.


సుప్రీం తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం

- రిజర్వేషన్ల అమలుకు జిల్లాల వారీగా కులగణన చేసి శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఎస్సీ వర్గీకరణ విషయంపై ఏలూరులో మాలల రౌండ్‌ టేబుల్‌ సమావేశం


మాలల రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాతున్న డాక్టర్‌ మెండెం సంతోష్‌ కుమార్‌

ఏలూరు (టూటౌన్‌): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని, ఈ దేశంలో రాజ్యాంగం ఉన్నంత కాలం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనంటూ మాలల చర్చా సమావేశం అభిప్రాయపడింది. జిల్లాల వారీగా కులగణనచేసి శ్వేతపత్రం విడుదల చేయాలని సమావేశం డిమాండ్‌ చేసింది. షెడ్యూల్‌ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ మెండెం సంతోష్‌ కుమార్‌ అధ్యక్షతన మంగళవారం మాలల రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. స్థానిక ఇండోర్‌ స్టేడియం ఎదురుగా ఉన్న లేడీస్‌ క్లబ్‌ నందు ఎస్సీ, ఎస్టీ కులాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా చుండూరు మృతవీరులకు, ప్రజా యుద్ధనౌక గద్దర్‌ వర్ధంతి సందర్భంగా నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మాల జాతి ఏ ఇతర కులాలకు వ్యతిరేకులం కాదు అన్నారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఆశయాలకు వారసులమని, దేశ చరిత్రను అర్థం చేసుకుని భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత నేడు ఎస్సీ, ఎస్టీ కులాలపై ఆధారపడి ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేడు ఎస్సీ, ఎస్టీ కులాల వర్గీకరణ చేయాలని, ఉద్యోగులకు క్రిమీలేయర్‌ చేస్తామనటం మనువాదంను అనుసరించటమేగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మాల జాతిపై ఉన్న ద్వేషంతో మిగిలిన అన్ని కులసంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్ర అని రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో తీర్మానం చేశారు. భారత రాజ్యాంగపు హక్కులను కాపాడేందుకు «మాల జాతి యోధుల పోరాట సంఘం» పేరుతో ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తామని సమావేశంలో తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దాసరి రమేష్‌ బాబు, నేతల రమేష్‌, పల్లెం ప్రసాద్‌, అబ్బూరి అనిల్‌ , అలగా రవికుమార్‌, నూకపెయ్యి కార్తీక్‌, పులవర్తి కొండబాబు, దాసరి శ్యామ్‌, మేరుగు సత్యనారాయణ, చిన్నం సునీల్‌, యువజన నాయకులు ఎరికపాటి విజయ్‌, గొల్ల కిరణ్‌, కొరబండి బాబూరావు, డి.మణిరాజు, కాపుదాసి రవి, కె.దిలీప్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వందన సమర్పణ పులవర్తి డేవిడ్‌ చేశారు.

రేషన్‌ బియ్యం పట్టివేత


చింతలపూడి మండలం దేశవరంలో పట్టుబడ్డ రేషన్‌ బియ్యం

చింతలపూడి: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని విజిలెన్స్‌, పౌర సరఫరాల శాఖ అధికారులు మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. రీజనల్‌ విజిలెన్స్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ అధికారి కరణం కుమార్‌ ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా చింతలపూడి మండలం, దేశవరం గ్రామంలో రెండు వాహనాల్లో తరలించడానికి సిద్ధంగా ఉన్న 75 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని పట్టుకున్నట్లు విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ పి శివరామకృష్ణ తెలిపారు. పట్టుబడ్డ బియ్యం విలువ రూ.3 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈ బియ్యాన్ని కాకినాడకు తరలిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. పట్టుబడ్డ బియ్యంతో పాటు మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని సామిరెడ్డి వీరవెంకట్రావు, కొడమంచిలి బుజ్జి, కటారి చెన్నారావు, చోడిశెట్టి మహేష్‌, చోడిశెట్టి సతీష్‌, ఆకుల వీరబాబులపై నిత్యవసరాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో సివిల్‌ సప్లైస్‌ డిటీ మల్లికా జరీనా , పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

11.25 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం పట్టివేత

పెదవేగి : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియాన్ని విజిలెన్స్‌ అధికారులు పట్టుకున్నారు. పెదవేగి మండలం కొప్పులవారిగూడెం గ్రామం వద్ద మంగళవారం 11.25 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని బొలెరో వాహనంలో తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నమట్ల వెంకట రమణ, కొనకళ్ళ రాంబాబు, ఉప్పులూరి చిరంజీవిపై నిత్యవసర వస్తువుల చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్‌ ఇన్‌స్పెక్టర్‌ పి శివరామకృష్ణ, సివిల్‌ సప్లై ఏఎస్‌ఓ వై ప్రతాపరెడ్డి, ఇతర పౌర సరఫరా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మడకరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. రజక వత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక చుక్కా అప్పల స్వామి భవనంలో అద్దాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర కార్యదర్శి మడక రాజు మాట్లాడుతూ రజకులకు ఎక్కడ అన్యాయం జరుగుతుందో చూసి అక్కడ న్యాయం చేయాలన్నారు. రక్షణ చట్టం ఏర్పాటు చేయకపోతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యండమూరి నాగేంద్ర, టేకు శ్రీను, కొడమంచిలి వాసు తదితరులు పాల్గొన్నారు.

29 మంది వృద్ధులకు ఉచిత వైద్య సేవలు


సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యసేవలు

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి 29 మంది వృద్ధులు హాజరయ్యారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ శిబిరంలో డాక్టర్ భూపతిరాజు రమేష్ చంద్రబాబు రోగులకు వైద్యసేవలందించి బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వృద్ధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లలో మార్పులు వంటివి వివరించారు. నిరుపేదలైన వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, ద్వారంపూడి బాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు అద్దాల సత్యనారాయణ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాధు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు

తణుకు: వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బెగారి జాన్సన్, కార్యదర్శిగా ఎండీ ఖుద్దూస్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు పీఎస్ సుధాకర్ తెలిపారు. మార్టేరు రెడ్డి కల్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులతోపాటు చైర్మన్‌గా కె.కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చింతకాయల సత్యనారాయణ, కోశాధికారిగా బి.గంగా మహేష్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా డీఆర్‌జేఎస్ శేఖర్‌బాబు, జి.బలరామరాజు, సహాయ కార్యదర్శిగా కేవీఆర్ సుబ్బారావు, కె.వినాయకరెడ్డి జిల్లా మహిళా ప్రతినిధిగా నర్మదలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు, నియోజకర్గ, మండలాల ఇన్‌చార్జ్‌లు, జిల్లాలోని వ్యాయామ విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంలో శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానవర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ

తాడేపల్లిగూడెం: నాబార్డు సహకారంతో పెదవేగి మండలం రామసింగారం గ్రామానికి చెందిన పెరటికోళ్ల పెంపకంపై శిక్షణను పొందడానికి మంగళవారం ఉద్యానవర్సిటీకి వచ్చారు. కోడిగుడ్లను పొదిగే ఇంక్యుబేషన్ యంత్ర వినియోగం, ఒక రోజు కోడి పిల్లలను జాగ్రత్తగా పెంచడం, వ్యాక్సినేషన్ పద్ధతులపై శిక్షణను ఇచ్చారు. ప్రయోగపూర్వక అభ్యాసం కోసం మహిళలు ఈ శిక్షణకు వచ్చారు. వర్సిటీ విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ, కెవికె శాస్త్రవేత్త దేవీవరప్రసాదరెడ్డి, గ్రామోదయ ట్రస్టు ఫౌండర్ సీహెచ్.శ్రీనివాసు నాబార్డు సహకారం గురించి వివరించారు.

'గూడెం'లో 49.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో గడిచిన 24 గంటల్లో 49.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు మంగళవారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 30.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.

భైరవం.. భీకరం

బెంబేలెత్తుతున్న జనం
- పట్టుకుంటే కండలాగేస్తున్న వైనం..
- గుంపులుగా మీదపడుతున్న పరిస్థితి..
- పట్టించుకోని అధికార యంత్రాంగం..


తణుకు సజ్జాపురంలో వీధి కుక్కల స్వైరవిహారం

తణుకు అర్బన్: కుక్క ఉన్నది జాగ్రత్త అని ఇళ్ల ముందు బోర్డులు పెట్టి గృహాల వద్దకు వచ్చేవారికి జాగ్రత్తలు సూచిస్తుంటాం. మరి వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న శునకాల పరిస్థితి ఏంటని, వాటిని ఎవరు అదుపు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వీధి వీధినా దర్శనమిస్తున్న ఊర కుక్కలు ప్రయాణికులు, పాదచారులను హడలెత్తిస్తున్నాయి. పాదచారులైతే వాటి దయాదాక్షిణ్యాలపైనే ఇంటికి చేరే దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. తణుకు పట్టణ పరిధిలో ప్రతి వీధిలోను గుంపులు గుంపులుగా వీధి కుక్కలు తిష్టవేసి ప్రయాణికులను భయాందోళనలకు గురిచేయడమే కాకుండా పిక్కపట్టుకుని పీకేస్తున్నాయని చెబుతున్నారు. గుంపులుగా వచ్చి మీద పడి కరుస్తున్న వీధి కుక్కలను పట్టించుకునే వారు లేకపోవడంతో వాటి ఇష్టారాజ్యంగా మారింది. తణుకు ప్రాంతంలో నిత్యం ఏదో పక్క కుక్క కరిచిందంటూ బాధితులను ఆస్పత్రులకు తీసుకువెళ్తున్న దుస్థితి. ముఖ్యంగా సజ్జాపురం, బ్యాంక్ కాలనీ, ఇరగవరం కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, పాతవూరు ప్రాంతాల్లో వీధి కుక్కలు సంచరిస్తూ పాదచారులను కరిచేస్తున్నాయి. పాఠశాలలకు వెళ్లే చిన్నారులైతే భయాందోళనకు గురవుతుండడంతో తల్లి తండ్రులు కూడా పెట్టుకుని తీసుకువెళ్లే పరిస్థితి దాపురించింది. పాఠశాలంటే భయపడే చిన్నారులు నేడు వీధిలోకి రావాలంటే కుక్కలను చూసి భయపడుతున్నారు. మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా కుక్కల సంతతి పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయిస్తామంటూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం 25 మందికిపైగా కుక్కకాటు...

తణుకు పట్టణంతోపాటు పరిసరప్రాంతాల నుంచి తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి కుక్క కరిచిందంటూ బాధితులు 30 మందికిపైగా నిత్యం వస్తుంటారని వైద్యులు చెబుతున్నారు. కుక్క కరిచిన వారికి టీటీ ఇంజక్షన్‌తోపాటు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) నాలుగు డోసులను 28 రోజుల వ్యవధిలో వేస్తారు. రోజులో 25 మందికిపైగా కుక్కకాటు బారినపడుతున్న వారితోపాటు పాత బాధితులతో కలిపి నిత్యం 30 మందికిపైగా ఆస్పత్రికి వస్తున్నట్లుగా తెలుస్తోంది. కుక్కకాటు తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి ఇమ్యునోగ్లోబులిన్స్ అనే ఇంజక్షన్‌ను కూడా అదనంగా చేస్తున్నారు. తల భాగానికి దగ్గరగా కుక్కకాటుపడిన వారికి అపాయం ఎక్కువగా ఉంటుందని, కుక్కకాటు బాధితుల మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. సుమారుగా నెలలో వెయ్యి మందిపైగా కుక్కకాటుకు గురవుతున్న పరిస్థితులు ఉన్నప్పటికీ అధికార యంత్రాంగం గోడమీది పిల్లిలా చూస్తున్నారంటూ ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.


రాష్ట్రపతి రోడ్డులో తిష్ట వేసిన వీధి కుక్కలు

కుక్కలను దూరంగా తరలించాలి



తణుకులో కుక్కల సమస్య చాలా తీవ్రంగా ఉంది. రోడ్డుపై నడిచేవారిపై మూకుమ్మడిగా దాడికి దిగి కరిచేస్తున్నాయి. పిల్లలను బయటకు పంపించాలంటేనే భయం వేస్తోంది. మునిసిపల్ అధికారులు వెంటనే వీధి కుక్కలను దూరంగా తరలించేలా చర్యలు తీసుకోవాలి.

– గోడి నాగబాబు, తణుకు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పెంటపాడు పీహెచ్‌సీలో సిబ్బంది, డాక్టర్లతో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి కోసూరి రవికుమార్

పెంటపాడు: సీజనల్ వ్యాధుల నియంత్రణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కోసూరి రవికుమార్ పేర్కొన్నారు. పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఫీవర్ సర్వేలు చేయడం, అనుమానితుల నుంచి రక్తపూతలు సేకరించడం తప్పక చేయాలన్నారు. ప్రజలు ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ప్రజలకు అవసరమైన మందులు ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు, వైద్యాధికారులు పూజిత, మౌనిక, పవన్, అనిషా, ఆరోగ్యవిస్తరణాధికారులు సత్యనారాయణ, పర్యవేక్షకులు సత్యనారాయణ, సీహెచ్‌వో సుజాత, మారిశెట్టి తేజోనాథ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కడకట్ల ఆరోగ్య కేంద్రంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు.

సర్కారు బడుల్లో ఎన్నికలు షురూ

- 8న ఎస్ఎంసీ నూతన కమిటీల ఎన్నికకు సర్వం సిద్ధం
- అదే రోజూ కమిటీల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియ


తణుకులో పాఠశాల విద్యా కమిటీ సమావేశం దృశ్యం (ఫైల్ ఫొటో)

తణుకు టౌన్: తణుకు పలు ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ మేనేజ్ కమిటీల ఎన్నికలకు ఏపీ సమగ్ర శిక్ష అధికారులు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. దీనిలో భాగంగా ప్రతి ప్రభుత్వ అనుబంధ పాఠశాలలో ఈనెల 8వ తేదీన నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించేలా విద్యాశాఖ మార్గదర్శకాలు సిద్ధం చేసింది. జిల్లాలోని ప్రైవేటు, ఇతర పాఠశాలలైన అన్ని ప్రభుత్వ పాఠశాలలతోపాటు కేజీబీవీ, గురుకుల పాఠశాలల్లో ఈ ఎన్నికలను నిర్వహిస్తారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు ఉచిత నిర్బంధ హక్కులోని సెక్షన్ 21 ప్రకారం ఈ విద్యా కమిటీలను ప్రభుత్వం నియమించాల్సి ఉంది. గత ప్రభుత్వం బడుల్లో ఏర్పాటు చేసిన పేరెంట్ కమిటీల పదవీకాలం ఈ ఏడాది జూలై నెలతో ముగియడంతో కొత్తగా పేరెంట్ కమిటీల స్థానే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలుగా పేరు మార్చి ఆగస్టు నెలలో ఎస్ఎంసీలు ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర సమగ్ర శిక్ష చర్యలు తీసుకుంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లతో ఓటరు జాబితాలను సిద్ధం చేశారు. దీని కోసం ఆయా పాఠశాలల వద్ద ఇప్పటికే పాఠశాలలో చదివే పిల్లల తల్లిదండ్రులు, సంరక్షకులను ఓటర్లు గుర్తిస్తూ ఓటరు జాబితాలను ఏర్పాటు చేశారు. ఆయా పాఠశాలల్లో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు తల్లిదండ్రులను సభ్యులుగా ఎన్నుకుంటారు. ప్రాథమిక పాఠశాలల్లో 15 మంది, యూపీ స్కూల్లో 21 మంది, హైస్కూల్స్‌లో 24 మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఆరుగురు ఎక్స్ అఫీషియో, ఇద్దరు కో–ఆప్షన్ సభ్యులు ఉంటారు. ఈ ఎన్నికలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. మొత్తం 500 పాఠశాలల్లో ఈ ఎన్నికలు నిర్వహిస్తున్న డీవైఈవో మురళీ సత్యనారాయణ తెలిపారు.

యోగాలో విద్యార్థుల ప్రతిభ


తణకు అర్బన్: యోగాలో సత్తాచాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: జిల్లాస్థాయి యోగా పోటీల్లో తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మావతి తెలిపారు. 45వ జిల్లా యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో గణపవరంలో నిర్వహించిన యోగా పోటీల్లో 8వ తరగతి విద్యార్థిని బి.నాగ జయశ్రీ ప్రథమ స్థానంలో నిలవగా, 6వ తరగతి విద్యార్థి ఇ.వినయ్‌కుమార్ తృతీయస్థానం, జీవీఎస్ అంకిత్, చరణ్‌తేజ్‌లు కన్సలేషన్ బహుమతులకు ఎంపికైనట్లు వివరించారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు.

యోగా విజేతలకు అభినందనలు


తాడేపల్లిగూడెం(టీఓసీ): యోగా విజేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సత్యసాయి ధ్యాన మండలి నిత్య యోగ సాధన కేంద్రం నిర్వాహకులు బడుగు చంద్రశేఖర్ పర్యవేక్షణలో శిక్షణ తీసుకున్న సాధకులు ఇటీవల జిల్లా స్థాయి యోగా పోటీల్లో వివిధ కేటగిరిలలో యోగా గురువు బడుగు చంద్రశేఖర్‌తోపాటు శ్రీనివాస్, హేమలత, అమ్మాజీ, చిట్టెమ్మ, సాయి శిరీష, చిరంజీవి, అభినేత్రి, తోట లక్ష్మిలు విజేతలుగా నిలిచారు. పలువురు అభినందించారు. సెప్టెంబర్ నెలలో విశాఖపట్నంలో 13,14, 15, తేదీల్లో రాష్ట్రస్థాయి యోగాసన పోటీల్లో విజేతలు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారు.

ఉపాధి పనులపై సామాజిక ప్రజావేదిక


సమావేశంలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

పెంటపాడు: మండలంలోని పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బాలాజీ అధ్యక్షతన ఈ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం సమయానికి ఉపాధికి సంబంధించి 21 గ్రామాల్లో రూ. 25,300 సొమ్ము రికవరీ చేసినట్లు డ్వామా పీడీ ప్రభాకరరావు వెల్లడించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 9,898 ఫించన్ల పంపిణీలో భాగంగా సుమారు 40 ఫించన్లకు పైగా అనర్హులను గుర్తించామని ఎస్ఆర్‌పీ గోవింద్ తెలిపారు. కాగా వీటిపై మరో మారు గుర్తింపు కోసం ఎంపీడీవోకు సిఫార్సు చేసామన్నారు. ఉపాధి పనులు, గృహ నిర్మాణం, సచివాలయాలు తదితర అంశాలపై సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి ఆళ్ల విజయలక్ష్మి, ఎస్టీఎం సత్యనారాయణ, ఏపీవో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉద్యాన యాత్ర


ఉద్యాన యాత్రకు కెవికెకు వచ్చిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: మార్టేరులోని వ్యవసాయ పాలిటెక్నిక్‌లో చదువుతున్న విద్యార్థులు ఉద్యాన యాత్రలో భాగంగా మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యానవర్సిటీని సందర్శించారు. ఉద్యానవర్సిటీ ప్రాంగణంతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం, పరిశోధనశాల, మ్యూజియం వంటి వాటిని సందర్శించారు. కెవికె సమన్వయకర్త ఇ.కరుణశ్రీ, తదితరులు విద్యార్థులు విషయాలను వివరించారు.

ఐక్య ఉద్యమాలు నిర్మించి పోరాటం చేద్దాం


నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దళిత పీడిత కులాల పేదలపై దాడులకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు నిర్మించి పోరాటం చేద్దామని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) నాయకులు పిలుపునిచ్చారు. కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్రజా కళాకారుడు గద్దర్ వర్ధంతి, చుండూరు మారణకాండ జరిగిన రోజు సందర్భంగా పట్టణంలో మంగళవారం దళిత మృత వీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కుల నిర్మూలన పోరాట సమితి ఉమ్మడి గోదావరి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మెరిపో జాన్ రాజు, గెడ్డం రవీంద్రబాబులు మాట్లాడుతూ ఐక్య పోరాటాలు చేయడం ద్వారా దోపిడి నివారణ జరుగుతుందని చెప్పారు. మాల మహానాడు అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, రాపాక వెంకటేష్, ఎస్‌కే మస్తాన్, సీపీఐ నాయకులు మండల నాగేశ్వరరావు, గాలింకి ప్రేమ్ కుమార్, అల్లం రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్డు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు నీలాద్రిపురం విద్యుత్ ఇన్‌చార్జ్ ఏఈ రత్నాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

తణుకు తహసీల్దార్‌గా వర్మ



తణుకు: మండల తహసీల్దార్‌గా డీవీఎస్ఎస్ అశోక్ వర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధుల్లోకి చేరారు. గతంలో పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్‌గా తణుకులో పని చేసిన వర్మ పదోన్నతిపై తహసీల్దార్‌గా పెనుమంట్ర బదిలీపై వెళ్లారు. అనంతరం ఎన్నికలకు ముందు రావులపాలెం బదిలీఅయ్యారు. ఈసందర్భంగా వర్మ మాట్లాడుతూ తణుకు మండలంలోని రెవెన్యూ సంబంధిత అంశాల్లో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

దివ్యాంగుల పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని దాతలు రవితేజ, ప్రత్యూష దంపతులు, చార్వికలు అన్నారు. స్థానిక భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగులకు బిస్కెట్లు, చాక్లెట్స్, పెన్సిల్ బాక్స్‌లు అందజేశారు. వక్తలు మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పిల్లలను ఆదరించాలని, వారి విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, సత్యవతి, నాగలక్ష్మి, రత్నకుమారి, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేరళ రాష్ట్రంలోని వయనాడు జిల్లా వరద బాధితులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైల్వే గూడ్స్ షెడ్డు యూనియన్ నాయకులు కోరారు. తాలూకా రైల్వే గూడ్స్ షెడ్డు వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పట్టణంలో మంగళవారం జోలు పట్టి విరాళాలు సేకరించారు. వక్తలు మాట్లాడుతూ జాతీయ విపత్తుగా ప్రకటించి కేరళ రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు.

ఘనంగా శ్రావణమాస పూజలు


ప్రత్యేక అలంకరణలో బోడపాడు ముత్యాలమ్మ

పెంటపాడు: మండలంలో పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలలో మంగళవారం శ్రావణ మాస పూజలు ప్రారంభించారు. బోడపాడు ముత్యాలమ్మ, పెంటపాడు గౌరీదేవి అమ్మవారు, కె. పెంటపాడు, ఉమామహేశ్వరం గ్రామాల్లో పెంట్లమ్మ అమ్మవార్లు, రావిపాడు, బెండల్లంక, ప్రత్తిపాడు గ్రామాల్లో కనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. పలువురు మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బిడ్డకు తల్లిపాలే మొదటి టీకా


తాడేపల్లిగూడెం రూరల్: అప్పారావుపేట గ్రామంలో తల్లి పాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఆరు నెలల వరకు తల్లి ముర్రుపాలు ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే.శ్రీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని అప్పారావుపేట గ్రామంలో కోడ్ నెం .149, కుంచనపల్లి కోడ్ నెం.96, 97, 263 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కే.శ్రీదేవి మాట్లాడుతూ తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే పోషకాలు ఉన్నాయన్నారు. తద్వారా బిడ్డ ఆరోగ్యంగా పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. కుంచనపల్లిలో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అచ్చమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కంకిపాటి కుమారి, పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే ఆరోగ్యం

పెంటపాడు: తల్లిపాల ద్వారానే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యరక్ష లభిస్తుందని పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వి. మౌనిక పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాలు పురస్కరించుకొని పెంటపాడు పీహెచ్‌సీలో ఆశాలు, ఐసీడీఎస్ నిర్వాహకుల సమావేశం సూపర్‌వైజర్‌లు, జీజీబీ విజయలక్ష్మి, సుజాతల అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌనిక మాట్లాడుతూ బిడ్డ డెలివరీ అయిన గంటలోపు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలన్నారు. తల్లి ద్వారా బిడ్డకు అందేపోషకాల వల్ల ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ విషయాన్ని కాన్పు అయిన సమయంలో ఆశా వర్కర్లు తప్పక గర్భిణులకు, బాలింతలకు తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి చెందిన సిబ్బంది, ఆశా వర్కర్లతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిపాలు ప్రాముఖ్యతను తప్పక గుర్తించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): తల్లిపాలు ప్రాముఖ్యతను తల్లులు తప్పక గుర్తించాలని డాక్టర్ అనీషా పేర్కొన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా ఐదోవ రోజు పట్టణంలోని కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 23వ వార్డులో నిర్వహించారు. తల్లి ముర్రుపాల విశిష్టతపై తల్లులకు, గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విశాలాక్షి, దుర్గా భవాని, మెడికల్ అండ్ హెల్త్ స్టాఫ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పెంటపాడు: తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది


తాడేపల్లిగూడెం (టీఓసీ) : కడకట్లలో తల్లిపాలు వారోత్సవాల ర్యాలీ